విద్యాధికుల ధర్మములు.

★

By

K. VEERESA LINGAM

విద్యాధికుల ధర్మములు

1893

సామాజికులారా! మిత్రులారా!

మూడు దినములనుండి మనమీ మందిరమునందు మన సమాజముయొక్క సంవత్సరోత్సవమును జరుపుచున్నాము. ఈ సంవత్సరముతో పదునేనేండ్లు గడచి షోడశవర్షప్రాయమునొంది మనసమాజమిప్పుడు తన యౌవనదశారంభమును సూచించుచున్నది. బాల్యదశ జాఱుటచేత మన సమాజమునకిఁక స్వకృత్యమును ధైర్యముతో నిర్వహింపవలసినకాలము వచ్చినదని నేను నమ్ముచున్నాను. నానమ్మికమును బలపఱిచెడు సూచనలును నామనస్సున కిప్పుడు కొన్ని పొడకట్టుచున్నవి. ఆరంభదశ మొదలుకొని మన సమాజము నిర్వహింపఁగలిగిన ఘనకార్య మిదియని నేను జెప్పలేకపోయినను జన్మదినమునుండియు సమాజముయొక్క యునికినే యుపేక్షచేసి యూరకుండిన మన పురజనులనేకు లిప్పుడు ముచికుందునివలె చిరకాలనిద్రనుండి యాకస్మికముగా లేచి మనమీఁద ధ్వజమెత్తి మన ప్రయత్నములకు విఘాతములు చేయ బాటుపడ నారంభించుట చూడఁగా మన సమాజ మితరు లుపేక్షచేసి యూరకుండవలసినంత దుర్బలమయినది కాదని పూర్వాచారపరాయణులయిన మన పురజనులకుఁ జూపి యొక ఘనకార్యమును జేయఁగలిగినదని భావించుచున్నాను. ఇప్పుడు యుద్ధ మారంభమయినందున భగవదాజ్ఞను శిరసావహించి మన సామాజికు లిఁక నెట్టి పౌరుషముతో దురాచారపిశాచములతోఁ బోరాడుదురో, యెంతవఱకు విజయమునొంది యీశ్వరమతమును దేశమునందు వ్యాపింపఁజేయుదురో చూడవలసి యున్నది. యుద్ధమే

యారంభముకానిపక్షమున భక్తివిశ్వాసములతో నీశ్వరసేవయందుఁ దమప్రాణముల నర్పించి పోరాడు వీరభటులెవ్వరో యీశ్వరద్రోహులయి పాతిపోయి యసత్యపిశాచముల వాతఁబడు పిఱికిపంద లెవ్వరో తెలియరాదుగదా! ఇంతవఱకును మనమీఁదికి రాక యూరకున్న ప్రతిపక్షు లింతచొరవతో మనపయికి దండువెడలుటకు వారి కిప్పుడేమి బలము దొరకెనని కొందఱు సందేహపడవచ్చును. మునుపీవంకనుండువారు సహితము భయపడి తమ్మనుసరింపఁగా నధిక సంఖ్యతో మనమీఁద దాడివెడలుటకు మన ప్రతిపక్షుల కిప్పుడితర బలము లేకపోలేదు. వారికిప్పుడు మనుష్యబలము మాత్రమేకాక తమ్మిప్పు డాశ్రయించియున్న తమపాలిటి భాగ్యదేవతయొక్క బలము కూడ సమకూడినది. సృష్ట్యాదినుండియు ప్రపంచములోని వివిధజాతుల వారిచేతను గల్పింపఁబడిన సమస్తదేవతలకంటెను బలాధికురాలయి గణనాతీత జనపరంపరచే నారాధింపఁబడుచున్న మహాదేవత యొకటి వారికి బ్రాపయి నిలిచి సకలవిధముల తోడుపడుచున్నప్పుడు వారు మనమీఁద దండెత్త సాహసింపక యేల వెనుకతీయుదురు? వారి దేవతతో సమానమయిన చుఱుకఁదనము గలది నా బుద్ధికి మఱేదియు గోచరముకాలేదు; దాని కెప్పుడును బడలికయే లేదు. అటువంటి విచిత్రశక్తిగల యపూర్వదేవత మనలను గెలుచుటకయి వారి కెన్నో విద్యల ననుగ్రహించి యున్నది; ఎన్నో యద్భుతసాధనములను బ్రసాదించియున్నది; ఎన్నో యపూర్వదర్శనములను తనంతనే కరుణించి యున్నది. తన శక్తిచేత దేవుని రాజ్యమునే యాక్రమించుకొనఁగలుగుదునని గర్వించుచున్న యీ మహాదేవతయొక్క మహిమలను వేయినోళ్ళవాఁడును వర్ణింపఁజాలఁడు. ఆమె యేకకాలమునందే వివిధస్థలములయందున్న తనభక్తులకెల్లఁ బ్రత్యక్షమగుచు, యెల్లవారి

మనస్సులను పూని, ఎల్లవారికిని క్రొత్తక్రొత్తశక్తులను సమయము నకుఁ దగిన ట్లపరిమితముగా ప్రసాదించుచున్నది. ఇంతటి భక్తసుల భురాలయిన సుప్రసిద్ధ దేవతయొక్క పేరేమో తెలిసికోవలెనని మీలోఁ గొందఱికి వేఁడుగకలుగవచ్చును. అందఱి నోళ్ళలో నుండెడి యీ పేరెల్లవారు నెఱిఁగియుండవలసినదే యయినను సమయమున కొకవేళ స్మరణకు రాకపోవచ్చునని నేనే చెప్పుచున్నాను. షడక్షరీ మహామంత్రమునువలె శ్రద్ధతో వినుఁడు. ఆ మహాదేవియొక్క దివ్య నామము "మూఢత్వదేవత." ఇఁక నా దేవత మనమీఁదఁ బ్రయో గించుటకయి తనభక్తుల కనుగ్రహించిన వరలాభములపేళ్ళు కొన్ని వినుఁడు. ఆమె వారికి నేర్పిన విద్యలు పరిహాసములు, దూషణములు; మిథ్యాదోషారోపణములు మొదలయినవి; వారి కనుగ్రహించిన విజయసాధనములు బెదరింపులు, బహిష్కారయత్నములు, దుర్బోధలు మొదలయినవి; వారికి ప్రసాదించిన యపూర్వదర్శనములు తెలుపు నలుపుగాను సత్య మసత్యముగాను పుణ్యము పాపముగాను దోఁచెడి విపరీతరూపములు మొదలయినవి ప్రతిపక్షులు మనమీఁదఁ బ్రయో గించెడు సాధనకలాపముయొక్క స్వభావమిప్పుడు కొంత తెలిసినది కదా? ఇఁక మనము సత్యకవచమును దొడిగికొని ధర్మఖడ్గమును చేతధరించి సత్కార్యాచరణశూరులమయి యీశ్వరపక్షమున నిలిచి యుద్ధమునకు సంసిద్ధులము కావలెను. సకలజన వశ్యతగల యీ మూ ఢత్వదేవతయొక్క చర్యల స్వభావమునుగూడ కొంచెము వినుఁడు. ఆ దేవతయొక్క పని యెప్పుడును సత్యమును, సర్వేశ్వరుని మూల పట్టించి యీ స్థానమున మూఢవిశ్వాసమును, ప్రతిమలను నెలకొల్పుట; మానసికధ్యానమును మాన్పి తావళములను త్రిప్పించుట; అను తాపమును రూపుమాపి పాపపరిహారార్థ మని బూడిదను

పూయించుట; జ్ఞానతేజస్సును బోఁద్రోలి పట్టపగలు దీపములు వెట్టించుట; భక్తియుక్తమయిన యీశ్వర సామీప్యానుభవము త్రోలగించి ధూపములను విగ్రహపూజలను శ్రీపాదతీర్థములను పురికొల్పుట; వ్యాధిబాధితులకును వికలాంగులకును రక్షణశాలలను మాన్పించి మనుష్యనిర్మిత శిలాదారు దేవతలకు గృహములు కట్టించుట; తెలిసిన స్వభాషతో వేఁడ నియ్యక తెలియని భాషాపదములను నోట వల్లన వేయించుట లోనయినవి. ఆదేవతకు ప్రీతికరములయినపను లిటువంటి వనంతములుగా నున్నవి. అవియన్నియు నెవ్వరు వల్లింపగలరు? ఇటువంటి యమోఘసాధనసంపత్తియు విచిత్రకృత్యములునుగల దేవతచే నడపఁబడు భక్తాగ్రేసరులు మనము హృదయపూర్వకముగా తెలిసిన తేటమాటలతో జేయు ప్రార్థనలను నిరర్థకములని దూషించి యర్థము తెలియని "పునంతు మాం బ్రాహ్మణపాదపాంసవః" ఇత్యాది దేవభాషావాక్యపఠనమే సార్థకమని యెట్లు భూషింపకుండఁ గలుగుదురు? సచ్చిదానందస్వరూపుఁ డయిన పరమాత్మని ధ్యానింపవలయు నన్న యుపదేశము కాసిమాట యని పరిహసించి మూఁడుపేటలు వేసిన త్రాటిని మెడలో వేసి "ఓం భూర్భువస్సువః" యనుటయే బ్రహ్మోపదేశమని యెట్లు సంతోషింపకుండఁ గలుగుదురు? మనలను భక్తిహీనులనియు నాస్తికులనియు దూషించుచు మనమీఁద దండయాత్ర వెడలెడు పరమభాగవతోత్తములలో నూటతొంబదితొమ్మిదిపాళ్ళిట్టి మహానుభావులే. ఈ మహానుభావులే దేవతలమీఁదను భక్తిలేని యాస్తికశిఖామణు లయినను పామరులను వంచించుటకయి కుంకుమబొట్లను విభూతిపెండెకట్లను ముఖమున ధరించి శాక్తేయులవలె జుట్లు విరియఁబోసికొని వీరశైవులవలె సివము లాడుచు, మూఢతా దేవియొక్క యగ్రసేనకు

నాయకు లయి ముందుగా మనమీఁద జైత్రయాత్ర వెడలుదురు. ఈ కపటనాటకు లుత్సవసమయములయందు తమ వాకిట మద్దెళ్ళతోను తాళములతోను మహాధ్వనితో భక్తులు దేవునిముందు హరి నామస్మరణ చేయుచున్నను పట్టపగ లావంక తొంగిచూడ నొల్లక భోగముదాని పాటగాని,'భోగము'దన్న మాటగాని చెవిని బడినతోడనే వీధులవెంట మేళములముం దూరేగుటకు మహాభక్తితో నర్ధరాత్రములయందు సహితము బయలువెడలుదురు. ఇట్టివీరు హిందూమతోద్ధారకులయిన నాయకులఁట! వీరిమాటలు మహర్షి మతములఁట! ఓమహర్షిసత్తములారా? ప్రాజ్ఞశిఖామణు లయిన మీరిప్పు డుండిన యెడల మీమతము లివి కావనియు మానసికారాధనమే మీమతమనియు ఈవంచకులముందు సహస్రముఖముల ఘోషించి యుందురు గదా? ఓమహానుభావులారా! మరల సజీవులయి లేచి వచ్చి మనుష్యులతోఁ మాటాడఁగల మహిమ మీయొద్దనున్న పక్షమున - తత్క్షణమే విజయముచేసి మీరెప్పుడును తెలియనిభాషతో నేవో వల్లించి ప్రార్థన యనుకో లేదనియు, కాలానుగుణము లయిన మార్పులను జేసికొని యభివృద్ధినొందుచు వచ్చితి మనియు వీరికి బోధింపరాదా? పాపమునకు పరితాపపడి హృదయపూర్వకముగా ప్రేమను గనఁబఱుచుటయే యారాధన కాని తెలియనిపదము లేవేవో పలికి గంటలు వాయించి ప్రసాదములు గైకొనుట యారాధన కాదని తెలియఁజెప్పరాదా? సర్వవ్యాపియైన దేవుని విడిచి లోహవిగ్రహములను దర్శించుటకయి యూరూరఁ దిరుగుట మీమతము కాదని యుపదేశింపరాదా? మిమ్ము జేసిన దేవునిసేవ మాని మీరు చేసిన బొమ్మల కొలువు చేయుట మీయభిమతము కాదని బుద్ధి చెప్పరాదా? "మీరేమిచేయవేఁడుచున్నారో మీరెఱుఁగరు; మీ రేమిపలుకుచున్నారో

మీరు గ్రహింపలేరు. ఇదా ప్రార్థన ?" అని పరిహాసింపరాదా ?

ఇవియన్నియు లోకమును బాగుచేయవలెనన్న వెఱ్ఱియాశతో పలవరించుచున్న నా వ్యర్థము లయిన కోరికలు. మన మొఱ్ఱలాలించి పూర్వమహర్షు లోకవేళ శ్రమపడి లోకానుగ్రహార్థముగా నిక్కడకు విజయంచేసి పయినిజెప్పిన రీతిని దమ యథార్థ మతసారమును మేఘ గంభీర భాషణములతో ఘోషించినను, దురాచార పిశాచావేశు లయి మూఢత్వదేవతకు ముఖ్యభక్తులయియున్న పండితమ్మన్యు లా స త్యములను చెవి యొగ్గి వినన్నై నను విందురా ? వినరు. ముమ్మాటి కిని వినరు. ఓ ఋషివర్యులారా ! మీరు శ్రమపడి వచ్చిన ప్రయో జనము లేదు. ఇక్కడ సత్యగ్రహణాదర మెవ్వరికిని లేదు. మీ కాల మునందు సత్యమన్న మధురవాక్కు మీచెవుల కెంత ప్రియతమ ముగా నుండునో యీ కాలమునందు మీ సంతతివారయిన యీ భరత ఖండవాసులకు సత్యమన్న పేరంత వెగటుగానున్నది. ఈ కాలమునో సఖ్యమును సత్యాదరమును సరిపడవు. ఆరంభమయిన యుద్ధము జరిగి తీఱవలెను. ఇప్పుడు సత్యమున కసత్యముతోను, వివేకమున కవివేకము తోను, జ్ఞానజ్యోతి కజ్ఞానాంధకారముతోను పోరాటము పడినది. పశ్చిమఖండపండితులు మన దేశముమీఁద విడిచిన ప్రకృతిశాస్త్ర కన్యలవలన కలిగిన శ్రోత్రయుగాహా లభినవపటుత్వముతో నానాముఖ ముల వ్యాపించి ముదిసియున్న ప్రాఁతయూహలను పీఠములనుండి కద లింపఁ జూచుచున్నవి; నూతన సదాచారమహామంత్రములు పురాతన దురాచారభూతములను తఱిమి వేయఁజూచుచున్నవి; నవీనజ్ఞానసూర్యో దయము ప్రాచీన మూఢవిశ్వాస తమస్సులను పాఱద్రోలఁజూచు చున్నది. చిరకాలమునుండి మన హృదయములలో పాతుకొని యుండి మనమీఁద రాజ్యముచేయ మరఁగియున్న మూఢత్వదేవత

తన యధికారము విడువ నొల్లక తెంపరితనమున సుజ్ఞానభానునితోఁ బోరాడఁదలఁచి తనభక్తులనందఱిని తోడుపడఁ బిలుచుచున్నది. చిరకాలస్నేహము వలనను మూఢత్వమునకు మూలబల మయిన దురాచారభూతములయొక్కయు దురభిమాన పిశాచముల యొక్కయు ప్రేరణమువలనను సుస్థిరప్రభు భక్తి గలవారై దురాలోచనలేని బహుసంఖ్యాకు లయిన జను లందఱును మూఢత్వదేవతయొక్క పక్షమవలంబించి తద్రక్షణపరాయణులయి మూఁకగా ప్రతిఘటించి నిలిచియున్నారు. సత్యప్రియత్వమువలన దురభిమానమును విడిచి సదాచారగ్రహణదీక్షవహించిన కొందఱుమాత్ర మజ్ఞానాంధకారమును బాఱఁద్రోలవలయు నన్న యుత్సాహముతో విమర్శఖడ్గమును ధరించి వీరభటులవలె సుజ్ఞానభానునిపక్ష మవలంబించి పోరాడుటకు బయలువెడలుచున్నారు. ఇట్లవివేకమునకును సువివేకమునకును దుర్జ్ఞానమునకును సుజ్ఞానమునకును జరుగుచున్న యీ యుద్ధముచేత దేశమున కంతకును సంక్షోభము కలుగుచున్నప్పుడేదో యొకపక్షమునఁ జేరక యూరకుండుట యెవ్వరికిని శక్యము కాదు. వివేకులందఱును గ్రమక్రమముగా సత్యపక్షమునఁ జేరుదు రనుటకు సందేహము లేదు. యుద్ధముయొక్క పర్యవసాన మెట్లగునో యన్న సందేహమంతకుముందే లేదు. కాలపరిమితి మాత్రము నిర్ణయించుట సాధ్యము కాదు కాని తుద కజ్ఞాన మోటుపడి సుజ్ఞానమునకు విజయము కలుగుట నిశ్చయము. అజ్ఞానాంధకారము లోకమునం దంతట నెంత దట్టముగా వ్యాపించియున్నను సుజ్ఞానభానుఁడు బయలువెడలి తన తీక్ష్ణకిరణములను బఱపినప్పుడు క్రమక్రమముగా తొలఁగి మూలలను గుహలలోను దాగి యడఁగుటకు సందేహ ముండదు. జ్ఞానపావకుని ప్రతాపముచేత మూఢత్వదేవత యమోఘసాధనములని సంతోషించు

చున్న కల్లలనెడు వేయుంచుల యినుపకత్తులన్నియు నీరుగా కరఁగి పోవును; అవిమర్శలనెడు గదలన్నియు భస్మము లగును.

ఇంతవఱకును మన ప్రతిపక్షుల బలమును సాధనసామగ్రియు వారుచేసెడు యుద్ధక్రమమును వర్ణించితిగాని యిట్టి సమయమునందు మన మెట్లు ప్రవర్తింపవలయునో మన ధర్మము లేవో వివరించి యుండలేదు. కాఁబట్టి యిప్పుడు సామాన్యముగా విద్యార్థు లందఱి యొక్కయు ముఖ్యముగా మన సామాజికులయొక్కయు ముఖ్యాచరణీయములయిన ధర్మములనుగూర్చి కొంచెము సంభాషించెదను. మన సామాజికులలోను మన యుపన్యాసములను ప్రసంగములను విను వారిలోను విశేషభాగము విద్యార్థులని మన ప్రతిపక్షు లొక యాక్షేపణను బలుకుచున్నారు. అదియొక గొప్ప యాక్షేపణముగా భావించుకొని మనపక్షము దుర్బలమయినదని వారు పొంగుచున్నను, విద్యార్థులధికముగాఁ జేరుచుండుటవలననే మనపక్షము సబలమయి, భావి శుభసూచకముగా నున్నదని నేను సంతోషించుచున్నాను. మన దేశము తన భావిక్షేమాభివృద్ధుల నిమిత్తమయి యిప్పుడు పిన్నలుగా నుండి ముందు పెద్దలు కాఁబోవుచున్న విద్యార్థుల కొఱకే యెంతో యాశతో నెదురుచూచుచున్నది. ఈ ప్రపంచ నాటకమునం దిప్పటి పెద్దలు వినిపించుచున్న కథ యించుమించుగా ముగియవచ్చినది. వారీవఱ కందఱును వినిపించుచువచ్చిన పురాణకథా శేషమునే వృద్ధ వాక్యములతోఁ గొంతకాలము వినిపించి కథాశేషులయ్యెదరు. ఈప్రపంచ నాటకరంగమునందు మహాసామర్థ్యముతో క్రొత్తయాట లాడి హృదయరంజకముగా నూతనకథను వినిపించి సర్వజనులకు సంతోషమును గలిగింపవలసినవారు లేఁబ్రాయములో నున్న యిప్పటి విద్యార్థులే. వీరు తమకథను జక్కగా నేర్చుకొని సర్వజన హృదయాహ్లాద

కరముగాఁ బ్రయోగించిన పక్షమున రాఁబోవు విద్యార్థులును వీరి మార్గము నవలంబించి నీతి ప్రధానమయిన కథను మఱింత వృద్ధిపఱిచి దేశక్షేమలాభములకొఱకు ధైర్యోత్సాహసామర్థ్యములతో సర్వత్ర ప్రయోగించుచు వచ్చుటచేత మనదేశ మచిరకాలములోనే భూతల స్వర్గమయి సుఖసంతోషనిలయము కావచ్చును. మనదేశ మెప్పుడయి నను విద్యార్థుల మూలముననే వృద్ధికి రావలసియున్నది. అందుచేత మనదేశము స్వాభివృద్ధికయి విద్యార్థుల కృషినే నిరీక్షించుచున్నది. దురాచారదూషితములుకాని నిర్మల మనస్సులుఁగల విద్యార్థులు గాక, సంవత్సరశతములనుండి పరంపరగా వచ్చుచున్న దురాచారవాసనల చేత యుక్తాయుక్తవివేకచింతను విడనాడి, కఠినమనస్కులయియున్న మన తండ్రులును, తాతలును, ముత్తాతలును, ముత్తవలును తమ చిన్న నాటి యలవాటులను మఱచి మన యూహలను బోధనలను క్రొత్తగా నిప్పుడు నేర్చుకొని, తమ ప్రాంతయూహలను పూర్వాభిప్రాయములను మార్చుకొని దేశాభివృద్ధికయి పాటుపడుట సంభవించునా? వారు తా మభివృద్ధి పొందవలసినట్టియు నిప్పటి యూహలనుబట్టి యితరుల నభివృద్ధి చేయవలసినట్టియు కాలము దాటిపోయినది. వారిని నూతన మార్గములకు త్రిప్పుటకయి మనము చేయు కృషి సహితము సఫలము కానేరదు. వారిని వారియూహలకును వారికర్మలకును వారివిశ్వాస ములకును వారిపూర్వాచారములకును విడిచిపెట్టి బాగుపడుటకుఁ గావలసినంత యాశయు నవకాశము నున్న చిన్నవారిని మంచిమార్గ మునకుఁ దెచ్చుటకయి మన శక్తియుక్తుల నుపయోగింపవలెను.

మనము జనసామాన్యమునకంటె విద్యాధికుల మగుటచేత వారిస్థితిని బాగుపఱుచుటకయి కృషిచేయవలసిన భార మొకటి మనమీఁద పడుచున్నది. విద్య యెక్కువయిన కొలఁదిని విద్యాధిక్య

ముతోఁ వచ్చు కార్యభారములను సహితము మనము వహించి నిర్వహించుచు రావలెను. మనము విద్యాలాభమును మాత్రము పొంది యందువలన మనమీఁదబడిన భారమును భరింపనొల్లని పక్షమున ధర్మమును తప్పినవార మగుదుము. మృగమునకును మనుష్యునకునుగల భేదము స్వార్థపరత్వమును విడుచుటతో నారంభమగును. విద్యాగంధములేక కేవల స్వప్రయోజనపరుఁడుగా నుండువాఁడు మృగప్రాయుఁ డనఁబడును. అట్టి మృగప్రాయుఁడయిన స్వకార్యధురంధరుఁడు జ్ఞానసౌధముయొక్క యడుగుభాగమునసైనను జేరలేక యంధకారబంధురమయిన పాతాళగుహాయం దున్నవాఁడగును. వెలుతురులేక చీఁకటిలో నున్నవానికి తన దేహమొక్కటి తక్క వేఱేదియు తోఁపకుండుట వింతకాదుగదా ? వాఁడు కొంచెము పయికివచ్చి జ్ఞానసౌధముయొక్క యడుగుభాగమును జేరి వెలుతురులోఁ బ్రవేశింపఁగానే వానికి గోడలనడుమనున్న భాగమును దానిలోనున్న వారును గానఁబడుదురు. ఈప్రకారముగా మృగప్రాయుఁడు గాఢాంధకారమునుండి వెలువడి తనమృగత్వమును గొంతవిడిచి కొంచెము మానవత్వమును బొంది నాగరికుఁడయి జ్ఞానజ్యోతియొక్క తేజస్సును దర్శింప నారంభింపఁగానే స్వార్థపరత్వమును గొంచెము విడిచి తన యింటనుండు భార్యాపుత్రాదులను బంధువులను ప్రేమించి వారి క్షేమము నిమిత్తమయికూడ పాటుపడువాఁ డగును. అతఁడే యింకొక మెట్టెక్కి యాపయిని మఱియొక్క మెట్టెక్కి క్రమక్రమముగా జ్ఞానసౌధముయొక్క యుపరిభాగమునకుఁ బోయి నలుప్రక్కల దృష్టి వ్యాపింపఁ జేసినకొలఁదిని క్రిందనున్నప్పుడు నాలుగుగోడలమధ్య నున్నదితప్ప మఱియేదియుఁ జూడలేనివాఁ డంతకంతకు చుట్టును నున్నయిండ్లను గ్రామములను దేశములను వరుసగాఁ జూడ నారం

భించి స్వప్రయోజనపరత్వచింత యంతకంతకు తగ్గుచు రాఁగా క్రమక్రమముగా తనవారి యిండ్లనియు తన యూరనియు తన దేశమనియు నభిమాన మేర్పఱుచుకొని తన ప్రేమను వానిమీఁదికి సహితము వ్యాపింపఁజేసి సమయము వచ్చినప్పుడు వానికిని తోడుపడుచువచ్చును. ఇట్లు దేశాభిమాన మెప్పు డేర్పడునో యప్పుడే దేశక్షేమము చేయవలెనన్న బుద్ధియు పుట్టి దినదినక్రమమున ప్రేమానుబంధము దృఢపడును. ఆ మనుష్యుఁడే జ్ఞానముయొక్క యున్నతపదవిని బొంది పిట్టవలె నుపరిభాగమున కెగసి పయినుండి క్రిందికి చూడఁగలిగిన పక్షమున, అప్పు డాతని దృష్టికి తనయూరును తనదేశమును మాత్రమేకాక చుట్టునుగల యితరదేశములును గోచరములగును. ఇట్లు పయి కెగసిన కొలదిని వస్తువులు కానఁబడెడు రీతిలోఁ గూడ నొకవిశేషము కలదు. ఉపరిభాగమున కెగసిన కొలఁదిని తన యిల్లంతకంతకు చిన్నదగుచు వచ్చి మిక్కిలి పయికిఁబోయి లోకమునంతను జూచునప్పుడు తన యిల్లామధ్య నదృశ్యమగును. ఈప్రకారముగానే జ్ఞానముయొక్క మహోన్నతదశకు పొందిన వాని దృష్టిపథమునం దెప్పుడును లోకక్షేమమంతయు నుండును గాని తనవారియొక్క క్షేమముమాత్రము ప్రత్యేకముగా నుండదు. దీనినిబట్టి విచారింపఁగా జ్ఞానికి ముఖ్యలక్షణము స్వప్రయోజనపరత్వమును పూర్ణముగా విడిచిపెట్టి లోకప్రయోజనము నిమిత్తమయి చూచుచుండుట యని స్పష్టమగుచున్నది. జ్ఞానమే మనుష్యలక్షణ మగుటచే సిటువంటి లక్షణముగలవాఁడే నిజముగా మనుష్యుఁడని పిలువఁబడుట కర్హుఁడయినవాఁడు. కాఁబట్టి యెల్లవారును స్వప్రయోజనపరత్వమును విడిచి పరోపకారపరాయణులయి మనుష్యనామమునకు పూర్ణముగా నర్హులగునట్లు ప్రవర్తించుటయే పరమార్థముగా భావించుకొని తమకృషి యంతయు నందు నిమిత్తమే

యుపయోగింపవలెను. ఇట్టిస్థితిని బొంద బ్రయత్నించుట మనుష్యజన్మ మెత్తినవానికెల్లను పరమధర్మమే యయినను, అది యందఱికిని సాధ్యము కాకపోవచ్చును. ఎవ్వఁడును పూర్ణముగా నొకవేళ సాధింపలేకపోయినను పరోపకారము నిమిత్తముయి నిరంతరకృషిని జేయుచుండువాఁడు చాలవఱకు పొందవచ్చుననుట కావంతయు సందేహము లేదు.

ఇఁకను బరోపకార మనఁగా నెట్టిది, దానిని చేయు క్రమ మెట్టిది, దానికయి ప్రయత్నించుటలో మన మాచరింపవలసిన ధర్మము లేవి, అను నంశములను గొంచెము విచారింపవలెను. జనసామాన్యమునకు క్షేమాభివృద్ధులు కలిగించుటయే పరోపకార మగుటచేత దానినిగుఱించి చర్చింపవలసిన పనిలేదు. ఇఁకను దానిని చేయు మార్గములనుగూర్చి కొంచె మాలోచింపవలసియున్నది. ఈ మార్గములను ప్రతిమనుష్యుఁడును విద్యార్థిదశలో నున్నప్పటినుండియు నేర్చుకొని మొదటినుండియు తదనుష్ఠానమున కర్తుఁడగుటకు కృషిచేయుచుండవలెను. కొంద ఱనుకొనునట్లు పాఠశాలలో పాఠములు వల్లించుట మాత్రమే విద్యార్థి ధర్మముకాదు. ముందు తన యిహలోకయాత్రకును సుఖమునకును దానిమూలమున దేశక్షేమాచరణమునకును తానర్హుఁడగుటకు నేర్చుకొనుటయు విద్యార్థి ధర్మమే. ఈ యవస్థయే లోకమునకుఁ దాను ముందుపయుక్తుఁడగుటకు నేర్చుకోవలసిన యుక్తకాల మగుటచేత విద్యార్థి యిప్పుడే సద్వర్తనమును కార్యభారమునకుఁ దగిన నిజమయిన పౌరుషమునుగూడ నభ్యసింపవలెను. దేహబలము గలవారిమీఁద విద్యాబలము గలవారే లోకములో నధికారము చెల్లింపవలసినవారయి యుండుటచేత వారెప్పుడయినను మూఢజనులకు నాయకులుగా నేర్పడి వారిని మంచిమార్గమున నడిపి దేశాభి

వృద్ధి చేయవలసినవారేకాని పామరుల మెప్పును స్తుతులను గోరి తమ విద్యకును బుద్ధికిని అవమానము కలుగునట్లుగా వారిచే నడుపఁబడ వలసినవారు కాఁగూడదు.

దేశాభివృద్ధికయి యాచరింపవలసిన ధర్మము లనేకవిధము లయి యున్నవి. ఈ దేశాభివృద్ధి మొట్టమొదట తనతో నారంభము కావలెను. అటుపిమ్మట తన కుటుంబమునకును తన గ్రామమునకును తన దేశమునకును క్రమముగా లోకమంతకును వ్యాపింపవలెను. మన యభివృద్ధికయి మొట్టమొదట నీశ్వరభక్తియు, సత్యానురక్తియు, ధర్మపరత్వమును, దుష్కర్మవిముఖత్వమును గల వారమయి మన యిహలోకయాత్రను పరిశుద్ధముగాను సుఖప్రదము గాను జేసికొని మనల నీశ్వరుఁ డీలోకమునుండి యే నిమిషమున తొలఁగింప నుద్దేశించినను శాశ్వతానందమును పొందుట కర్హులముగా నుండునట్లు సదా ప్రవర్తించుచుండవలయును. మనలను సన్మార్గము నుండి తొలఁగించుటకై యింద్రియసుఖవాంఛాదులను లుబ్ధులు సుఖాభాసబీజములను జవిచూపి వేఁటగాఁడు నూకలుచల్లి పిట్టల నాకర్షించునట్లుగా మన హృదయఖగముల నాకర్షించుచుండును. ఇట్లు విషయసుఖములు మనలను ధర్మపథమునుండి యాకర్షించినప్పుడు వలలోఁబడితిమేని పాపకిరాతబృందములు మనలను బట్టుకొని బాధించి సకలాకృత్యములకును లోఁబఱుచును. కాఁబట్టి మనజీవనమును పరిశుద్ధమయిన దానినిగాఁ గాపాడుకొనుటకయి మన మెల్లప్పుడును పాపము లనెడు శత్రువులతోఁ బోరాడుచుండి వానిని మన హృదయదుర్గములను జేరనీయక తఱుముచుండవలయును. బాహ్యశత్రువులతోఁ బోరాడుటకంటె నంతశ్శత్రువులయిన పాపములతోఁ బోరాడి వానిని నిర్జింపఁగలుగుటయే మన కెక్కువ పౌరుషము. ఈ పాపశత్రువులను

పూర్ణముగా జయించి పాఱఁదోలఁగలుగుట యీశ్వర సాహాయ్యము లేక మన యల్పశక్తులకు సాధ్యము కాదు. ఈశ్వర సాహాయ్యమును బొందుటకై యీశ్వరారాధనము కావలెను. ఈశ్వరునియందు పూర్ణమయిన ప్రేమను విశ్వాసమును ఉంచి పాపశత్రువులనుండి కాపాడి యాత్మసుఖము ననుగ్రహింప నీశ్వరుని హృదయపూర్వకముగా ప్రార్థించుచు, ఈశ్వరాజ్ఞలను మీఱినందునకై పశ్చాత్తాపపడుచు, సర్వకార్యములయందును నాతని చిత్తవృత్తి ననుసరించి వర్తించుచుండుటయే యీశ్వరారాధనము. ఈ యీశ్వరారాధనమును మఱచి యాత్మశక్తిని నమ్ముకొని కొంచె మేమఱియుండిన పక్షమున, పాపపిశాచము దొంగవలె మన హృదయసదనమునందుఁ బ్రవేశించి యక్కడనుండి యీశ్వరభక్తిధనము నపహరించి మనలను దుఃఖములపాలు చేయును. కాఁబట్టి పాపతస్కరుఁడు మన మనోవీధియందుఁ బ్రవేశింపఁగానే తెలిసికొని పరితాపపడి యీశ్వరుని ప్రార్థించి పాపమును బాఱఁదోలుటకై పిలిచి సేవించిన పక్షమున మన మనస్సులు మరల నిర్మలము లగును. ఈశ్వరు నారాధింపవలసిన యీధర్మమే మతధర్మ మనఁబడును. ఇదియే ధర్మము లన్నిటిలోను బ్రధాన ధర్మము; సమస్తసుఖప్రదాయకము. పాప మే మూలనయిన హృదయములోఁ బ్రవేశించి దాగియున్నదేమో యని యాత్మశోధనము చేయుచు నిత్యము నీశ్వరారాధనముచేయుచు మన వర్తనమును పరిశుద్ధమయిన దానినిగాఁ జేసికొనుచుండుటయేకాక మన బంధుమిత్రాదులనుగూడఁ బరిశుద్ధులనుగాను జ్ఞానులనుగాను సుఖపడువారినిగాను జేయుచుండుట మనకు రెండవ ధర్మము.

ఇట్లన్యోన్య సుఖము నిమిత్తమయి పరస్పరసాహాయ్యము చేసికొను మనుష్యుల గుంపంతయుఁ జేరి కుల మనఁబడును. కుల మను

శబ్దమునకు సమూహమని యర్థము. పరస్పర సుఖము నిమిత్తమయి జను లొండొరులతోఁ జేసికొనవలసిన ధర్మములు కులధర్మము లనఁబడును. ఇతరులను సుఖులనుగాఁ జేయుటకుఁ దగిన బుద్ధియు శక్తియు మనలో నీశ్వరుఁ డిమిడ్చి యుండుటచేతనే మనుష్యుఁడు మృగాదుల కంటె నధికుఁ డగుచున్నాఁడు; ఈబుద్ధిని, శక్తిని, లోకముయొక్క క్షేమాభివృద్ధుల నిమిత్త మెంతయెక్కువగా నుపయోగించిన మనుష్యుని కంతయెక్కువ ఘనత వచ్చును. ఈలోకములో సమస్తసుఖములును సమస్తక్షేమములును మతముయొక్క పరిశుద్ధత ననుసరించియే యుండును గాన మనము జనసంఘముయొక్క క్షేమము నిమిత్తమయి చేయవలసిన మొదటి యుపకారము మతమును సాధ్యమయినంత పరిశుద్ధమయిన దానినిగా జేయఁ బ్రయత్నించుట. ఈ ప్రయత్నములో మూఢజనులవలన ననేక కష్టములు సంభవించును. లోకములో నేపనియు కష్టపడక నెఱవేఱదు గనుక, మనము కులాచారసంస్కరణమునందును కష్టములను సహించి స్వప్రయోజనపరత్వమును త్యజించి యీశ్వరప్రీతికరముగా పనిచేయవలెను. దేశాభివృద్ధి యెప్పుడును తమక్షేమమున కంటె లోకక్షేమమే యెక్కువగా భావించి తమ ప్రాణములను శక్తులను సంపదలను దేశమునకు ధారపోసెడు పుణ్యపురుషులచేతనే యగుచు వచ్చినది గాని యేదేశమునందును స్వప్రయోజనపరులచేతను కుక్షింభరులచేతను స్వకుటుంబపోషణ ధనార్జనపరాయణతాధురంధరుల చేతను కాలేదు. కేవల కుక్షింభరుల మయినపక్షమున మనకు మృగాదులకంటె నాధిక్యమేదియు లేదు; మనకు ధనార్జనమే ముఖ్యకర్తవ్యము కాదు. మనము లోకములో నెంత ధనమార్జించినను, అల్పకాలోపయుక్తమయినదేకాని యది స్థిరమయినది కానేరదు. మనము కష్టపడి సంపాదించిన గృహములును, ధనమును మనతోరాక యెప్పటి

చోటనే యుండి కొన్ని సమయములయందు మన మరణానంతరమున
బంధుపుత్రాదులకు కలహకారణములు సహితమగును. మనము
న్యాయముగా నార్జించిన ధనమే మృత్యుదేవత మనకు ధనరక్షణభార
మును తప్పించిన తరువాత మాంసముకొఱకు వేచియున్న గ్రద్దలవలె
తాము కష్టపడి గడించుకొనక యితరు లార్జించిన దాని నపహరింప వేచి
యుండు బంధువులకు కలహకారణమును దుఃఖకారణము నగుచున్నప్పు
డాధన మన్యాయార్జిత మగునేని చెప్పవలసిన పని యేమున్నది? అప్పు
డది దానిని పొందువారికే కాక గడించిన వానికిని దుఃఖహేతువగును.
కాఁబట్టి మనల నెప్పుడో యొకప్పుడు విడిచి పోవునట్టియు దుఃఖకర
మగునట్టియు ధనమును కావలసినదానికంటె నధికముగా సంపాదించి
కూడఁబెట్టుటకు యత్నింపక మరణానంతరమున సహితము మనలను
విడువక తోడుపడి సుఖమిచ్చెడు సత్యధర్మరూపమయిన సుస్థిరధన
మును ఆర్జించుటకయి మనుష్యుఁ డధికకృషి చేయువలెను. ఇతరు
లకు మనము చేయవలసిన రెండవ యుపకారము దుర్నీతిదురాచారము
లను తొలఁగించి వారిని నీతిమంతులనుగాఁ జేయుట. సత్యవర్తనము
గలిగి యితరులను వంచింపక పరస్త్రీ పరధనాదుల కాశపడక న్యాయ
మార్గమున సంచరించుట నీతి యనఁబడును. నీతిని విడిచిన మత ముండ
నేరదు గనుక, ఇదియు మతధర్మమే యయినను కాలమహిమచేత
మనదేశమునం దిప్పుడు సద్వర్తనము లేని శ్రీచూర్ణరుద్రాక్షాది ధార
ణమే మతముగా మాఱినందున దీనిని మతమునకంటె వేఱుగాఁ జెప్ప
వలసివచ్చినది. జనసామాన్యముయొక్క క్షేమసంతోషములకు పరి
శుద్ధమయిన యీశ్వరోపాసన మెట్లావశ్యకమో యట్లే నీతివర్తనము
నావశ్యకమయిన దగుటచేత దానిని స్థాపించుటకుఁ గూడ మనము
విశేషప్రయాసము పడవలసి యున్నది. కొందఱు మనదేశములో

మతము పేరు చెప్పియే నీతిబాహ్యములయిన దుష్కృత్యము లనేకములుచేసి చేయించి హృదయమునుండి దయాగుణమును తొలఁగించి కొంతవఱకు మనుష్యస్వభావమునే రూపుమాపుచున్నారు. దేవుఁడందఱియందును సమానదయ గలవాఁడయి మనకిచ్చిన మృదుహృదయములనే వారికిని ప్రసాదించినప్పుడు మతధర్మములలో నిట్టి వ్యత్యాస మేలకలుగవలెనని యాలోచింపఁగా, వారు దేవుఁ డనుగ్రహించిన స్వాభావిక మతమును విడిచి మనుష్యకల్పితము లయిన యస్వాభావికమతముల నవలంబించుటవలన నీయనర్థమంతయు పొసఁగినదని స్పష్టపడుచున్నది. మతముతో చేరియున్నను, చేరియుండక పోయినను సమస్తవిధములయిన దుర్నీతులను తొలఁగించుట దేశక్షేమమున కత్యావశ్యకము. కాఁబట్టి విద్యార్థులయిన వారందఱును నీతి మత విషయముల రెంటియందునుగల దోషముల నితరులకుఁ జూపి వానిని వారు దిద్దుకొనునట్లు చేయవలెను. జనులు తమ దోషములను దిద్దుకోలేకపోవుటకుఁ గల యొక గొప్పకారణము దురభిమానము. తానే గొప్పవాఁడననియు తనకు తెలియనిదేదియు లేదనియు జనుఁడెప్పుడు దురభిమానమును పూననారంభించునో యప్పటినుండియు నతఁడు స్వలోపములను దిద్దుకొని యభివృద్ధిని పొందుట కవకాశము లేనివాఁడయి చెడుట కారంభించును. ఈ దురభిమానము జనులందఱిలోను వ్యాపించిన పక్షమున దేశముయొక్క దుర్గతి వేఱుగఁ జెప్పవలసినదే లేదు. సమస్తవిషయములయందును మనపూర్వులు సర్వజ్ఞులనియు వారికిఁ దెలియని దితరుల కేదియు తెలియదనియు మనమితరదేశస్థులవలన నేర్చుకొనవలసిన దేదియు లేదనియు మనవారిలో నొక దురభిమానము బలిసియున్నది. ఈ దురతిశయమే మనవారిని తమదోషములను విమర్శించి తెలిసికొననీయకయు నితరుల గుణాంశము

లను గ్రహింపనీయకయు దేశము నంతకంతకు చెఱుపుచున్నది. జనులకు నాయకులయి నడప నపేక్షగలవారు కొందఱు తమవారి తప్పులను జూపి దిద్దింపఁజూడక తుచ్ఛమయిన జనుల మెప్పున కాశపడి సర్వవిషయములయందును మనపూర్వులు పరిపూర్ణులని బోధించి స్తుతించి జనులలో దురభిమానమును దురతిశయమును బలియునట్లు చేసి తామేమో దేశాభిమానులయినట్లు నటించుచున్నారు. దేశాభిమానమెప్పుడును జనుల లోపములను జూపి వానిని తొలఁగింపఁ బాటుపడుటలో నుండును గాని నీచమయిన పామరజనానురాగము నపేక్షించి వారిదోషములను గుణములని భూషించి దేశమభివృద్ధి పొందకుండ చెడఁగొట్టుటలో నుండదు. ఈ యపూర్వదేశాభిమానులు క్షణభంగురమయిన మూఢజనానురాగము నిమిత్తము వారి మూఢ విశ్వాసములను మూఢాచారములను భూషించుటయేకాక వారితోఁ గలిసి వానిని సంస్కరింపఁగోరువారి నెల్ల బరిహసించుటలో నఖండ పాండిత్యమును జూపుచున్నారు. ఇట్లుచేయుట దేశాభిమానలక్షణము కాదు. నిజమయిన దేశాభిమాని యెప్పుడును పరోపకారచింతయు ధర్మచింతయుఁ గలవాఁడయి తనవారి లోపములను పాపములను నిర్భయముగా విప్పి చూపును. ఇట్లు చూపుటవలన దురభిమానులు దూషించి ద్వేషించుటయు, కపటదేశాభిమానులు పరిహసించుటయు సంభవించును. అయినను దేశాభిమానమాననీయుఁడు దేశక్షేమమునే మనస్సునందుంచుకొని యట్టి దౌర్జన్యములకెల్ల తలయొగ్గి స్వకృత్యమును ధైర్యముతో నిర్వహించుచు రావలెను. ఇట్లు చేయక విద్యాధికులు తమ వివేకమును పాతిపెట్టి జనులకు నాయకులుకావలెనన్న దురాశచేత స్తోత్రప్రియులయి విద్యావిహీనుల మూఢవిశ్వాసములను శ్లాఘించుచు వారిచే మంచివారనిపించుకొనుటకయి వారివలె మాటా

డుచు వారివలె వర్తించెడు పక్షమున నచిరకాలములోనే తామును మూఢులయి మూఢులకు నాయకులగుటకు మాఱుగా మూఢులకు దాసులయి మూఢులను నడుపుచున్నామన్న భ్రమతో మూఢులచే నడపఁబడువారయి విద్యాధికులన్న పేరున కపాత్రులగుదురు. ఇట్లగుట యెంత సిగ్గులచేటు! విద్యాధికులమాట యటుండఁగా స్వగౌరవమునందు దృష్టిగల విద్యార్థులు సహితము తామభ్యసించుచున్న విద్యకును బుద్ధికిని నపఖ్యాతి కలుగునట్లుగా నిటువంటి యపాత్రపుఁ బనికి లోఁబడఁ జూతురా? ధర్మశూరులయి తాము సత్యమని న్యాయమని నమ్మిన రీతిగాఁ బ్రవర్తించుచుఁ దాము నమ్మినట్లుగా నితరులకు నిశ్శంకముగా బోధింపక మూఢుల మెప్పునకయి మూఢవిశ్వాసములను దురాచారదోషములను శ్లాఘింపఁ జూతురా? పామరజనవిరోధమునకు భయపడి సత్కార్యపక్షమున నిలిచి సత్కార్యాచరణధైర్యము చూపలేని మగవారెన్నఁడయిన నాయకులగుదురా? జనద్వేషమునకును, పరిహాసములకును, బాధలకును వెనుకదీయక పామరులయొక్కయు, ధర్మభీరులయొక్కయు దురభిప్రాయమును గణనచేయక యితరుల తోడు లేకపోయినను భయపడక యసహాయశూరులయి యప్రియమయినను సత్యమార్గమును జూపు ధైర్యముగల పౌరుషభూషితులే కడపట నాయకులగుదురు. అట్టివారు మొదట కొంతకాలము దూషింపఁబడువారయినను తరువాత చిరకాలము భూషింపఁబడువారగుదురు. గుణాగుణగ్రహణము చాలని పామరుల మెప్పుతో మన కేమిప్రయోజనము? మన పనినిజూచి తెలిసినవారు మెచ్చుకొన్నప్పటివలె నవివేకులు మెచ్చుకొన్నప్పుడు సంతోషము కలుగునా? అనభిజ్ఞులు వేయిమంది మెచ్చుకొనుటకంటె నభిజ్ఞుఁడయినవాఁ డొక్కఁడు మెచ్చుకొనుట శ్రేష్ఠతరము కాదా? కాఁబట్టి

మనకెప్పుడును బుద్ధిమంతులయొక్కయు మంచివారియొక్కయు మెప్పు మాత్రమే యపేక్షణీయము. జనులలో విశేషసంఖ్యాకు లెప్పుడును విమర్శలేని మూఢశిరోమణులుగా నుందురు గాన వారి మెప్పెప్పుడును కోరఁదగినదే కాదు. కాఁబట్టి మంచివారందఱికంటె నెక్కువ మంచి వాఁడును బుద్ధిమంతు లందఱికంటె నధిక బుద్ధిమంతుఁడును వివేకు లందఱికంటె ఘనవివేకియు నయిన యొక్క యీశ్వరుని మెప్పునకయి మాత్రమే మనము చూడవలెను. ఆతని మెప్పొక్కటియే శాశ్వత మైనది; తక్కిన మెప్పులన్నియు నెండమావులవంటివి. కాఁబట్టి యెవ్వ రేవిధమున దూషించినను పాటిగాఁ బట్టక మతవిషయము నందును కులాచార విషయములందును నీతి విషయములందును జనులమెప్పు కోరక యీశ్వరప్రీతిని మాత్రమే కోరి సర్వాపదలను నోర్చి దేశక్షేమమునకయి పాటుపడవలెను.

మనము జనులకుఁ జేయవలసిన యింకొక యుపకారము కుల స్త్రీలలోను సామాన్యజనులలోను విద్యాభివృద్ధి చేయుట. మనమెంత తెలివిగలవార మయినను మన భార్యలను మన పొరుగువారిని మనతో సమానముగా తెలివిగల వారినిగాఁ జేయక వారిని మూఢత్వములో నుంచిన పక్షమున మనము విద్యాలాభమువలన సంతోషమును పూర్ణ ముగా పొందలేకపోవుటయేకాక వారి మూఢత్వమునుబట్టి మన మనేక కష్టములు పడవలసినవార మగుదుము. జనులకును స్త్రీలకును సద్విద్య చెప్పించిన పక్షమున ననేక దురాచారములను వారే తొలగించుకొని దేశక్షేమమునకు తోడుపడుదురు. అనేక కష్టములను సహించి హృద యము నానందపరవశముగాఁ జేసి మన కాంతలను దేవతాకాంతలను గాను మనగృహములను భూలోకస్వర్గములనుగాను మార్చెడి యద్భుత శక్తిగల గానవిద్యను కులాంగనలకు నేర్పి కుటుంబములు సంతోష

స్థానము లగునట్లు చేయుటయే కాక, అమృతోపమానమయిన యీ సద్విద్యను పండువంటి సంసారములను పాడుచేయుటకు కంకణము కట్టుకొన్నట్టియు, పాతకములలో నెల్లను ఘోరపాతకమయిన జారత్వమును కులవిద్యనుగాఁ జేకొనుటచే మానవజాతికంతకును దీఱని యవమానము తెచ్చుచున్నట్టియు వేశ్యలను పేరుగల పెనుభూతముల చేతులలోనుండి విడిపించుటకయి ప్రయత్నించుట దేశాభిమానలేశము గలవారి కందఱికిని ముఖ్యకర్తవ్యము. స్త్రీలకు నీతి విద్య మొదలగునవి యావశ్యకములని ప్రత్యేకముగాఁ జెప్పవలసిన పనిలేదు. తల్లియయి బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పవలసినదియు గృహమునకు రాణియై కుటుంబపరిపాలనము చేయవలసినదియు గృహపత్నియే యగుటచేతఁ దన సద్వర్తనమును జూచి బిడ్డలు సద్వర్తనము నేర్చుకొని వర్తించునట్లు చేయుటకును మూఢపూజలను విడిచి యేకేశ్వరారాధనము చేయుచు సమస్త సద్విషయములయందును విద్యాధికుఁడయిన భర్తతో నేకీభవించి లోకోపకార కార్యములయందెల్ల నాతనికి నిజమైన సహధర్మచారిణిగా నుండునట్లు చేయుటకును గావలసినంత విద్యను సంసారమును సారమునుగాఁ జేసికొని సుఖింపఁగోరు ప్రతిపురుషుఁడును గృహిణికి తప్పక చెప్పింపవలెను. పురుషునకు భార్య యర్ధశరీరమగుట సర్వజనాదరణీయమైన నిర్వివాదాంశ మగుటచేత భార్య విద్యాగంధము లేని మూఢురాలగునేని యీ యర్ధశరీరము పక్షవాతపీడిత మయినట్లు కదలక మూఢత్వభారముచే సదా క్రిందికి దిగలాగుచుండుటనుబట్టి చదువుకొన్నభర్త సంసారసముద్రములో సుఖముగా తేలలేక యజ్ఞానాంధకారముతో విచారజలావర్తమునందుఁ బడి తలక్రిందుగా మునిఁగిపోవును; అట్లుగాక భార్య జ్ఞానవాసనగల విద్యావంతురా లగునేని యీ యర్ధశరీర మారోగ్యోత్తేజితమయినట్లు కరలాఘవము చూపి

వివేకప్లవముచే సదా పయికి తేల్చుచుండుటను బట్టి చదువుకొన్న భర్త సంసారసాగరములో సుఖముగా నీఁదుచు జ్ఞానతేజస్సులో నానంద ద్వీపమును జేరి తరించును. కాఁబట్టి విద్యాధికు లయినవారు తమ భార్యలకును తోడఁబుట్టినపడుచులకును కూఁతులకును సద్విద్యను జెప్పించి తమతో సమానవివేకము గలవారినిగాఁ జేయుటకయి సర్వ ప్రయత్నములను జేయవలెను. అజ్ఞానాంధకారమునఁ బడి జ్ఞానతేజో దర్శనము లేక పుట్టుగ్రుడ్డవలె నున్న మనదేశపు కులాంగనల కన్నులు తెఱపి విద్యాదీపముచేత వారికి పదార్థవిజ్ఞానము కలుగఁజేసి యనను భూతపూర్వమయిన నూతనసుఖమును లభింపఁజేయుటకయి కృషి చేయుట పురుషనామధారుని కెల్లను బరమధర్మము. ప్రతి విద్యాధికునికి స్త్రీవిద్యాభివృద్ధిని జేయుట యెంతధర్మమో జనసంఘమునకు విద్యాభివృద్ధి చేయుటయు నంతధర్మమే. విశేషసంఖ్యాకు లెల్లయెడల నజ్ఞానాంధకారములోఁ గన్నుగానక యంధులవలె తడవులాడుచు కష్టపడుచుండఁగా వారిమధ్య నల్పసంఖ్యాకు లక్కడక్కడఁ గన్నుతెఱచి జ్ఞానదీపముచే వారిదురవస్థను జూడఁగలిగియు దయతో వారిగతి బాగుచేతఁ జూడక స్వసుఖమును జూచుకొనుచుండుట మానవధర్మమగునా? జనబాహుళ్యము జ్ఞానమునం దభివృద్ధిని బొందినగాని దేశ మభివృద్ధి పొందనేరదు. అందఱును మూఢులయి కొందఱు మాత్రము వివేకులగుటచేత మూఢజనపరివృతులయిన విద్యాధికులకును సంసర్గదోషమువలన బహుకష్టములు కలుగును. కాఁబట్టి విద్యాధికులు తాముపొందిన విద్యాలాభమును జనసామాన్యమునకును గలిగించుటకయి శ్రమపడవలెను.

రాజ్యాంగవిషయములయిన స్వాతంత్ర్యములనుగూర్చి ప్రజలకు తెలివిగలిగించుటయు జనులకొక యుపకారమే. పూర్వోక్తము

లయిన మత, నీతి, కుల, జ్ఞాన విషయములు నాలిగింటియందును పని చేయువా రిప్పు డంతగా మనదేశమునందుఁ గానఁబడక పోయినను రాజ్యాంగవిషయములయందు ప్రసంగించుటకుమాత్ర మనేకవక్తలు బయలు దేఱుచున్నారు. మతసంస్కారాదులలో బయలుదేఱక రాజ్యాంగ విషయములలోమాత్ర మింతమంది దేశాభిమానులు బయలు దేఱుటకు కారణమేమని కొందఱడుగవచ్చును. రాజ్యాంగవిషయ ములయందు శ్రమపడవలసిన యక్కఱ లేకయే సులభముగా ప్రసిద్ధి వచ్చుటయు, స్వప్రయోజనపరత్వమును, గొంతవఱకీ సాహసమునకుఁ గారణములని తోఁచుచున్నది. కొంచెము చదువుకొన్నవాఁడెల్లను తాను ప్రభువయి స్థానికప్రభుత్వము చేయుట కర్హుఁడ నయినా నను కొని తనకు జనపరిపాలకత్వము లభింపవచ్చునన్న యాశతో పని చేయుచుండవచ్చును. అయినను రాజ్యాంగవిషయములయందు సహితము స్వప్రయోజనపరులు చేయు కృషివలన నిజమయిన స్వాతంత్ర్యములును లాభములును కలుగనేరవు. మనము ముందుగా నీతియందు వృద్ధిపొందినఁగాని రాజ్యాంగస్వాతంత్ర్యములను పొందుట కర్హులము కాఁజాలము. నీతివృద్ధికి మతాభివృద్ధి కావలెను. మన మతసత్యములనేకములు దేశభాషలలో లేక జనసామాన్య దురవగాహమయిన సంస్కృతభాషలోనుండి జనసంఘమున కందని మ్రానిపండ్లయి స్వార్థపరులైన మతాచార్యుల పిడికిళ్ళలోనుండి విపరీత ప్రయోజనముకలవయి శిష్యహృత్తాపహారులుగాక విత్తాపహారులు మాత్రమయి యున్న గురువులకు జీవనాధారము లగుచున్నవి. రాజ్యాంగస్వాతంత్ర్యముల నిమిత్తమయి యత్నించుటకంటె ముందుగా మన కులాచారాదులను సంస్కరించుకొని తత్స్వాతంత్ర్యములను పొందుటకయి కృషి చేయవలెను. ఇంటి గాఢాంధకారమును తొలఁగించుకోలేని

వాఁడు బయట వెలుతురు నెట్లు వ్యాపింపఁజేయగలుగును ? మన భార్యలు విద్యాదీపము లేక యవిద్యాంధకారములో మునిఁగియుండఁగాను, మన బాలురు మంచినీతియు మతమును లేక చెడుత్రోవలు త్రొక్కుచుండఁగాను మన వితంతుపుత్రికలు మన యనాదరముచేత ననాథలయి యావజ్జీవము సుఖహీనలయి బాధపడుచుండఁగాను స్వగృహమును బాగుచేసుకోలేని మనము దేశము నెట్లు బాగుచేయ గలుగుదుము ? మన భార్యాపుత్రబంధువర్గమును ప్రేమించి మంచి స్థితికిఁ దీసికొనిరాలేని మనము లోకము నెట్లు మంచిదశకుఁ దీసికొని రానేర్తుము ? మన మిప్పటి భార్యతోఁగూడి బహిరంగముగా భోజనము చేయుటకు సాహసింపలేము; కుటుంబమునంతను ముందుంచుకొని కలిసి యేకేశ్వరుని ప్రార్థనచేయలేము; అతిబాల్యవివాహములను మానలేము; ఇతర దురాచారములను విడువలేము. ఇట్టి యల్పాంశములలో మనము బాగుపడి మనకుటుంబమును బాగుపఱుచుకోలేని మనము లోకము నేమి యుద్ధరింపఁ గలుగుదుము ? బాహ్యరోగములచే దేహములు కృశించుచున్నప్పుడు ఖేదపడి మందులు వేయించుకొనుచున్నట్లే పాపరోగములచే మనయాత్మలు కృశించుచున్నప్పుడు దుఃఖపడి తన్నివారణార్థమయి యీశ్వరప్రేమామృతౌషధము నేల పానముచేయఁ బ్రయత్నింపరాదు ? పొలములలో పయిరుపెట్టి తోఁటలువేసి ఫలానుభవము నపేక్షించునట్లు బీడుపడియున్న మన హృదయక్షేత్రములను బాగుచేసికొని భక్తిసస్యములను పుణ్యఫల వృక్షములను వృద్ధిపొందించి పాపకంటకములను పెల్లగించి యేల శాశ్వతములయిన సత్ఫలములను బొంది సుఖింపఁ బాటుపడరాదు ? ఈపనులకన్నిటికిని బ్రతిబంధములు మనము సత్యములని ధర్మములని నమ్మిన వాని ననుష్ఠించుటకు ధైర్యము పూనలేకపోవుట మనము

వట్టి బోధనలు చేయుటకంటె బోధించిన ధర్మముల ననుష్ఠించి చూపుట మన కధికకర్తవ్యము. అనుష్ఠానము లేకపోయిన పక్షమున మన యుపదేశము లన్నియు నున్మత్తప్రలాపములవంటివయి నిష్ఫల మగును. స్వప్రయోజనపరత్వమువలనను, మాంద్యమువలనను, ఉపేక్షవలనను, భయమువలనను మనకు ధర్మమయిన పనిని చేయుటకు మనము వెనుక తీసిన పక్షమున మన మొక్కరమే చెడుటకాక కపటవర్తనులను జేసి మన సంతతివారికి సహితము చెఱుపు చేసినవార మగుదుము. మన మనోనిశ్చయప్రకారముగా నడుచుకొన్నయెడల మన కీలోకములో మూఢులవలనఁ గొన్నికష్టములు రావచ్చును. వచ్చిన నేమి? రానిండు. మనకు దేశాభిమాన మున్నపక్షమునను, సత్యాదర మున్నపక్షమునను, ఈశ్వరభక్తి యున్నపక్షమునను, కష్టములకు వెఱచి మన మణుమాత్రమును సత్కార్యమునుండి మరల రాదు. కార్యసాఫల్యమునకయి మన మెప్పుడును కష్టములతో పెనఁగులాడుచునే యుండవలెను. అదియే దేవుని యేర్పాటు. ఆ కష్టములతోడి పోరాటమువలననే మనము మనోదార్ఢ్యమును బొంది కార్యదక్షుల మగుదుము. మన సత్కార్యాచరణమువలన మన కిక్కడ కష్టములే కలుగుచున్నను లోకమున కయినను మేలు కలుగకపోదు; మన సద్వర్తనమును జూచి యనేకులు మంచినడత నేర్చుకొని సుఖపడకపోరు. అందుచేత మనము మృతుల మయినను, మనకార్యముల మూలమున భూమిమీఁద నెప్పుడును జీవించి యున్నవారమే యగుదుము. కాఁబట్టి మిత్రులారా! మీ యుపేక్షను మాంద్యమును విడిచి యిఁకనైన సత్కార్యములకు దీక్ష వహింపుఁడు; మాటలు చాలించి శీఘ్రముగా కార్యములకు పూనుఁడు. ధర్మచింతయు నీశ్వరభక్తియు లేకపోవుటచేత నాచరణములేక యుపన్యాసములును సభ

లును వ్యర్థములగుచున్నవి. కాఁబట్టి ధర్మచింతను, ఈశ్వరభక్తిని గలవారమయి పరిశుద్ధజీవనములను బొంది మృగస్థితినుండి దేవస్థితికి లేవఁ బ్రయత్నింతము. మనకిట్టి పనులకు ధైర్యసాహసములను గలిగింప సర్వాభీష్టఫలప్రదాతయైన పరమేశ్వరుని త్రికరణశుద్ధిగా వేఁడుకొందము.
